క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలో సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.బాబు శుక్రవారం తెలిపారు. ఈనెల 11వ తేదీనుంచి 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని ఇల్లెందు రోడ్డు సూర్యథియేటర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

దాతలు సహకరించాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని డీఈఓ దక్షిణామూర్తి అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో స్ఫూర్తి రూరల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్‌ఎంఎంఎస్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు, ఉపాధ్యాయులు యాకుబ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

గార్ల: వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ సీహెచ్‌సీ ఉద్యోగులు శుక్రవారం ఆసుపత్రి ఎదుట మౌన ప్రదర్శన నిర్వహించారు. 10వ తేదీ వచ్చినా నేటికీ జీతాలు రాకపోవడంతో రెగ్యులర్ ఉద్యోగులు ప్లకార్డులు ధరించి మౌన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు బైరపాక శ్రీనివాస్, నర్సింగ్ ఆఫీసర్స్ స్వాతి, మెర్సీ, వినీల, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం విఫలం



గూడూరు: రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్ ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో ఆరె వీరన్న, రహీంపాషా, ఎదునూరి వెంకన్న, నూకల ఉపేందర్‌యాదవ్, మేరెడ్డి సురేందర్, లక్ష్మణ్, వెంకన్న పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్టు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి గిర్నితండాకు చెందిన లైలా అనే వివాహితను, తన భర్త బానోత్ వినోద్, అత్త కమిలి, రామకోటి(వినోద్ తాత)లు అదనంగా రూ.5లక్షల కట్నం కోసం వేధింపులకు గురి చేయడంతో, కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు తాగగా, చికిత్స పొందుతూ గత నెల 19న మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు మృతురాలి భర్త వినోద్‌ను శుక్రవారం డీఎస్పీ తిరుపతిరావు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. అదేవిధంగా మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో కాలిబాట విషయంలో ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి గాయపర్చిన దాసరి కొమురమల్లు అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మూడు షాపుల్లో చోరీ

కురవి: మండల కేంద్రంలోని ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సహకార సంఘం(సొసైటీ) కాంప్లెక్స్‌లో మూడు షాపుల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సొసైటీ కాంప్లెక్స్‌లో మెకానిక్ షాపు, ఫ్లెక్సీ షాపు, సెల్ పాయింట్ షాపులను నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి షాపుల వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టారు. షాపుల్లోకి దూరి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం షాపుల యజమానులు షాపు తీసి చూసే సరికి వెనుక తలుపులు పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. సెల్‌పాయింట్‌లో, ఫ్లెక్సీ షాపుల్లో ఏమి పోలేదు. మెకానిక్ షాపులో రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. దీంతో షాపు యజమాని పూర్ణచందర్ రెడ్డి కురవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విషయమై కురవి ఎస్సై సతీష్‌ను వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీరన్న సన్నిధిలో పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే(ఎస్‌సీఆర్) జోన్ ప్రిన్సిపాల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మలా రాజారాం శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ ఈఓ సత్యనారాయణ స్వాగతం పలికారు. సికింద్రాబాద్ డివిజన్ మెడికల్ సూపరింటెండెంట్ నారాయణ స్వామి, బానోత్ సునీల్ కుమార్, యుగేందర్ యాదవ్ పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బాల్నిధర్మారం గ్రామంలో పైపులైన్ పడిలిపోయి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ కథనం బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైంది. అందుకు స్పందించిన సంబంధిత గ్రామ కార్యదర్శి పగిలిన పైపు లైన్‌కు శుక్రవారం మరమ్మతులు చేపట్టి గ్రామస్తులకు రక్షిత తాగునీటిని అందజేశారు.

సాక్షి ఎఫెక్ట్..

తండాలో సమస్యల తాండవం

- రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలు కరువు
- కిలోమీటర్ దూరంలో అంగన్‌వాడీ కేంద్రం
- సమస్యలతో ఇబ్బంది పడుతున్న బంగారుచెలిమె తండావాసులు



తండాలో నిల్వ ఉన్న వర్షపు నీరు



కంకరపోసి వదిలేసిన రోడ్డు



సీసీరోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పెద్దవంగర: పెద్దవంగర మండల కేంద్రానికి సమీపంలో ఉన్న బంగారు చెలిమె తండాలో అభివృద్ధి అంటే ఇంకా దూరమైన కలగానే మిగిలిపోయింది. ఆరేళ్ల క్రితం నూతన గ్రామపంచాయతీగా ఏర్పడిన ఈ తండా ఇప్పటికీ మౌలిక సదుపాయాల కోసం తంటాలు పడుతోంది. పాఠశాలకు ప్రహరీ, అంగన్‌వాడీ, రోడ్లు, డ్రెయినేజీ, వంటి పలు సమస్యలతో నిండిపోయిన ఈ తండాలో తండా వాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

380 మంది, ఆరు వార్డులు..

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బంగారుచెలిమెతండా గ్రామపంచాయతీలో సూమారు 380 మంది గిరిజనులు నివసిస్తున్నారు. వీరిలో స్త్రీలు 183 పురుషులు 197మంది. ఈ తండాకు అవాస సూర్యతండా, ఒంపుతండాలు అవాస గ్రామాలుగా ఉన్నాయి. మొత్తం 6వార్డులతో కూడిన ఈ తండా ఏర్పడి ఏడు సంవత్సరాలు గడిచిన అభివృద్ధికి నోచుకోలేదు. రెండేళ్ల క్రితం మట్టిరోడ్డుపై కంకరపోసి వదిలేసినప్పటి నుంచి పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. నేటికి బీటీ రోడ్డు వేయకపోవడం వల్ల తండాకు వెళ్లడం కష్టమవుతోంది. రాళ్లతో నిండిన దారుల్లో కాలినడకన వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకరరోడ్డుతో ద్విచక్రవాహనాలు, పశువులు, వ్యవసాయం పనులకు వెళ్లే కూలీలు సైతం నరకయాతన పడుతున్నారు.

వంట గదిలో అంగన్‌వాడీ కేంద్రం

చిన్నారులకు అంగన్‌వాడీ భవనం లేకపోవడంతో పాఠశాల వంటగదిలో కొనసాగుతుంది. తండాకు అంగన్‌వాడీ కేంద్రానికి సూమారు కి.మీ దూరంలో ఉంటుంది. దీంతో గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతుండగా విద్యార్థులు తరగతులకు హాజరుకాలేక పోతున్నారు. ప్రాథమిక పాఠశాలకు మురుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రహరీ లేకపోవడంతో పిల్లల భద్రతకు ప్రమాదంగా మారింది. పక్కనే ఉన్న పొలాల నుంచి పశువులు, పాములు తరచుగా పాఠశాల ప్రాంగణంలోకి వస్తున్నాయి. పిల్లలు భయంతో ఆడుకోలేక చదువుకోలేక ఇబ్బంది పడుతున్నారు.

డ్రెయినేజీ లేక దోమల దండయాత్ర..

తండాలో ఏ ఒక్క బజారులో కూడా డ్రెయినేజీ వ్యవస్థ లేక పోవడంతో వర్షం పడిన ప్రతిసారి నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. సీసీ రోడ్లపై నిల్వనీరు దుర్వాసనతో ప్రజల ఆరోగ్యానికి ముప్పుకు గురి చేస్తోంది. నిల్వ నీటిని కాల్వల ద్వారా తవ్విస్తే సమస్య పరిష్కారం అవుతోంది. ఎస్సారెస్పీ కెనాల్ పక్కనే ఉన్న వ్యవసాయ పనులకు వెళ్లేందుకు రూ.2కిమీ ఫార్మేషన్ రోడ్డు వేయాలని, తండాలో కనీస మౌలిక వసుతులు కల్పించాలని తండావాసులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



పాలకులు, అధికారులు స్పందించి రోడ్లు, డ్రెయినేజీ, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు ప్రహరీ లాంటి వసతులు కల్పిస్తే బాగుంటుంది. పిల్లల భవిష్యత్ కోసం కనీస సదుపాయాలు కావాలి. మా తండా అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్ష. అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించి, రోడ్డు పనులు వేగవంతం చేయాలి.

– ధరావత్ విజయ, బంగారుచెలిమె తండా

సేవా కార్యక్రమాలు అభినందనీయం



విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే, విష్ణువర్ధన్ రెడ్డి

పెద్దవంగర: సామాజిక సేవలో కేతిరెడ్డి సోమనర్సింహరెడ్డి కుటుంబం చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎల్లారెడ్డి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జజాల సురేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని బొమ్మకల్లు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు దాత దీపిక–సోమనర్సింహరెడ్డి దంపతుల కుమారుడు ఎన్ఆర్ఐ విష్ణువర్ధన్ రెడ్డి రూ.లక్ష విలువ చేసే ఫర్నిచర్, మైక్‌సెట్‌తోపాటు విద్యార్థులకు స్పోర్ట్స్ టీ షర్టులు అందజేశారు. అనంతరం సురేందర్ మాట్లాడుతూ.. సొంత గ్రామంపై మమకారంతో విద్యాభివృద్ధికి ఆర్థికసాయం అందించడం అభినందనీయమన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు సునీల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, సురేష్, హరీశ్, కమాలాకర్, శ్రీనివాస్, బాలరాజు, సత్యం రెడ్డి, వెంకటరామయ్య, గంగాధర్ యాదవ్, గిరగాని రవి, సమ్మయ్య, వెంకన్న, రాంమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



మాట్లాడుతున్న వెంకన్న

గూడూరు: తెలంగాణ ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు, ఏజెన్సీ మండలాల్లోని గౌడలకు ఇచ్చిన మాట ప్రకారం ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన గీత కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ మండలాల్లో దశాబ్దాల కాలంగా గీత వృత్తిపై జీవిస్తున్న కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్నగౌడ్ పాల్గొన్నారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బొలగాని వెంకటనర్సుగౌడ్, మండల అధ్యక్షుడిగా పానుగంటి వీరస్వామిగౌడ్, ఉపాధ్యక్షుడు పుల్లూరు మల్లయ్య, కార్యదర్శి ముంజాల వీరస్వామి, సహాయ కార్యదర్శి దూపట్టి కుమారస్వామి, సభ్యులుగా గౌడిశాల వెంకన్న, గంధం వెంకన్న, వడ్లకొండ యాకయ్య, బొల్లికొండ మధు, భిక్షపతి, మల్లయ్య, సోషల్ మీడియా ప్రతినిధులుగా పానుగంటి అజయ్, బొడ్డు సంతోష్‌లను నియమించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



తొర్రూరు రూరల్: మాట్లాడుతున్న ఏసీడీపీఓ విజయలక్ష్మి

తొర్రూరు రూరల్: పౌష్టికాహారంతోనే గర్భిణి, బాలింత మహిళలు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ఏసీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండంలోని నాంచారీమదూరు అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, సూపర్‌వైజర్ గౌసియా, టీచర్లు పాల్గొన్నారు..

మరిపెడ రూరల్: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఉషా అన్నారు. శుక్రవారం మరిపెడ మండలం ఎల్లంపేట సెక్టార్ పరిధిలోని ఎల్లంపేట, సోమ్లతండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాస సంబురాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయ, సుమిత్ర, సువా, పార్వతి, రూప, కవిత, కార్యదర్శి దశరథం పాల్గొన్నారు.

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి రైతువేదికలో, బేరువాడ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ క్రాంతి, సూపర్‌వైజర్ దుర్గా, విజయ, రంజిత్, నాగార్జున పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

కేసముద్రం: ఎన్నికల ముందు తప్పుడు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఇనుగుర్తి మండల కేంద్రంలో నూతన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల గ్యారంటీ కార్డు ప్రకారంగా, హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బేతమళ్ల చంద్రయ్య, జాటోత్ హరిచంద్, దార్ల రామ్మూర్తి, శ్రీరామగిరి సొసైటీ చైర్మన్ వెంకన్న, బొబ్బిలి మహేందర్‌రెడ్డి, గండు నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి తరగని ఆస్తి ఉపాధ్యాయుడు

మహబూబాబాద్ రూరల్: మంచి ఉపాధ్యాయులు సమాజానికి తరగని ఆస్తిలాంటివారని ఎంఈఓ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పది సంవత్సరాలు పనిచేసి ఇటీవల జరిగిన పదోన్నతులలో స్కూల్ అసిస్టెంట్‌గా (ఇంగ్లిష్) పదోన్నతిపొంది మానుకోట కంకరబోర్డ్ పాఠశాలకు వెళ్లిన బొమ్మెర కృష్ణమూర్తి, తండ వనజ దంపతులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం పూజారి వీరయ్య, టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైన శ్రీనివాస్, హెచ్ఎం ధరావత్ భద్రు, ఉపాధ్యాయులు పాలకుర్తి మౌనిక, మాడిశెట్టి సూర్యప్రకాశ్, గొట్టిముక్కల పవన్ రాజ్, రాచకొండ ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులపై ఫీజుల భారం తగ్గించాలి



ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: కేయూ పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను తగ్గించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు మునగాల మహేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట శుక్రవారం సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలలో డిగ్రీ కోర్సులు 2025–26లో ప్రవేశాలు పొందిన ఫస్టియర్ మొదటి సెమిస్టర్ ఫీజులను ప్రభుత్వం భారీగా పెంచి పేద విద్యార్థులపై భారాన్ని మోపిందన్నారు. కార్యక్రమంలో షేక్ షబ్బీర్, మనోహర్, భిక్షం, నికిత, సంధ్య, శ్రావణి, వేణు, తరుణ్ పాల్గొన్నారు.

బీజేపీ విధానాలపై సీపీఐ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కురవి: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు రాకుండా అడ్డుకున్న కేంద్రంలోని బీజేపీ విధానాలను నిరసిస్తూ శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీ బిల్లు రాకుండా బీజేపీ తన రాజకీయ అవకాశవాద విధానంతో అడ్డుకుంటున్నదని విమర్శించారు. బీసీలకు మద్దతు ఇస్తున్నట్లు చెబుతూ లోపల వ్యతిరేకిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు తురక రమేష్, బుడమ వెంకన్న, టి.రమేష్, దూదికట్ల సారయ్య, కన్నె వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, నిలుగొండ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'భీం' స్ఫూర్తితో హక్కులు సాధించుకుందాం..



కొత్తగూడ: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కొత్తగూడ: కొమురం భీం స్ఫూర్తితో హక్కులు సాధించుకుందామని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కొమురం భీం వర్ధంతిని మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా గాంధీనగర్ నుంచి సంప్రదాయ డోలి వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, నాయకులు సుధాకర్, సంజీవ, రాజేష్, నర్సింగరావు, లక్ష్మినర్సు, నరేష్, సందీప్‌దొర, రామస్వామి, కల్తి ఎల్లయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

గంగారం: మండలంలోని మడగూడెం గ్రామంలో కొమురం భీం వర్ధంతిని నిర్వహించారు. కొమురం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు.

కాంగ్రెస్‌ను విమర్శించే హక్కులేదు



మాట్లాడుతున్న కత్తి స్వామి

గూడూరు: బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడారు. బీసీ బిల్లుపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో 42శాతం బిల్లు పెడితే, అక్కడ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆమోదించారని తెలిపారు. కానీ ఏనాడు దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఈ బిల్లు ఆమోదంపై మాట్లాడలేదని విమర్శించారు. వారి తోవలోనే బీఆర్ఎస్ నడిచిందన్నారు. నేడు హైకోర్టు స్టే విధించడం, ఎన్నికలు వాయిదా పడడంతో 42శాతం బిల్లు విషయంలో ఈ రెండు పార్టీలు కాంగ్రెస్ విఫలమైందని విమర్శించడంలో అర్థం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు బీసీ బిల్లుపై బీఆర్ఎస్, బీజేపీ ఎత్తుగడలను గమనించారని, రాబోయే రోజుల్లో రెండు పార్టీలకు బీసీలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, ఎండి.యాకూపాష, కట్ల విష్ణుగౌడ్, కన్నెబోయిన వెంకన్న, ఉప్పలయ్య, అశోక్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్

దంతాలపల్లి: క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం వేణుమాధవరెడ్డి, ఉపాధ్యాయులు సురేందర్ గుప్తా, ఫిజికల్ డైరెక్టర్ ఎడ్ల నాగిరెడ్డి, పీడీలు సాయికుమార్, అనిల్, కృష పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత



తొర్రూరు రూరల్: మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థిని అతియకు లయన్స్ సేవా తరుణి ఆధ్వర్యంలో రూ.45వేల నగదు, దుస్తులు అందించి శుక్రవారం చేయూతనిచ్చారు. కార్యక్రమంలో పతినిధులు రాజేందర్‌రెడ్డి, వేలూరు శారద, దామెర సరేష్, శ్రీదేవిరెడ్డి పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

గార్ల: అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి అలువాల సత్యవతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో ఈశ్వర్ లింగం, పెద్దవెంకటేశ్వర్లు, గోవింద్, ఉపేందర్ రెడ్డి, కైబాబు, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

సీజేపై దాడిని ఖండించాలి

మహబూబాబాద్ అర్బన్: సీజే గవాయ్‌పై జరిగిన దాడిని యావత్ ప్రజానీకం ఖండించి, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.లక్ష్మణ్‌నాయక్, అధ్యాపకులు జూపూడి అనిల్‌కుమార్, మసూద్ అహ్మద్, అన్నపూర్ణ, శ్రీనివాస్, హత్తిరామ్, ఖాసీం షా, ఉపేందర్ పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని బేతోల్ గ్రామంనుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతుల లేకుండా గుట్టలను తవ్వి మట్టిని తరలిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

బస్సు సర్వీసు ప్రారంభం

గంగారం: ఇల్లంద–నర్సంపేటకు వయా గంగారం, పాకాల కొత్తగూడ మీదుగా ఇల్లంద డిపోకు చెందిన నూతన బస్సును ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. ఉదయం 7గంటలకు, మధ్యాహ్నం 12గంటలకు ఇల్లంద నుంచి నర్సంపేటకు బయలుదేరుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని పాతబజారులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ సంగీత శుక్రవారం తెలిపారు. నేడు రెండో శనివారం సందర్భంగా సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

బకాయిలు విడుదల చేయాలి

తొర్రూరు: బెస్ట్ అవైలబుల్ పథకం కింద చదువుకునే విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్సీ విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం నాయకులు ఈదురు ఐలయ్య కోరారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

చిన్నగూడూరు: విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని ఎంఈఓ ఎస్.రవికుమార్ అన్నారు. మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాల్లో భాగంగా మండలంలోని విద్యార్థులకు అండర్ –14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో భాగంగా మండల స్థాయి ఎంపిక పోటీలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కిన్నెర యాకయ్య, ఇన్‌చార్జ్ హెచ్ఎం రెహమాన్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య దినోత్సవం

తొర్రూరు: మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ధీరజ్‌కుమార్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు, వైద్యాధికారి బి.నందనదేవి పాల్గొన్నారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

నెల్లికుదురు: అదుపు తప్పిన లారీ రోడ్డు పక్కనే ఉన్న బావిబొందలో పడింది. ఈ సంఘటన నెల్లికుదురు మండలం నర్సింహులగూడెం గ్రామ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిన వివరాల ప్రకారం.. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా క్యాంపు కార్యాలయం నుంచి పని వద్దకు సిమెంటు తీసుకెళ్లి వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇస్తుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ బానోతు మల్సూర్‌కు స్వల్ప గాయాలతో బయట పడ్డాడు.

కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీ చేస్తున్న పోలీసులపై ఓ యవకుడు తిరగబడగా పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్సై వి.దీపిక తెలిపిన వివరాల ప్రకారం వివరాల ప్రకారం... మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారులో రూరల్ పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో హజారియా తండాకు చెందిన బానోతు సుమమన్ బైక్‌ను పోలీసులు ఆపి బ్రీత్ అనలైజర్‌తో పరీక్ష చేసేందుకు అడగగానే బ్లూకోల్ట్స్ పీసీలు సంపత్, రాజులపై తిరగబడి వాగ్వివాదానికి దిగాడు. అతడిని అదుపులోకి తీసుకుని ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన చట్టంలో భాగంగా కేసు నమోదు చేశారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

బయ్యారం: ఈనెల 24, 25 తేదీల్లో గార్లలో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ యూనియన్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి వల్లాల వెంకన్న, అశోక్, ఆదిశేషులు, సర్వర్‌పాషా, రమేశ్, వెంకన్న, నరేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



దీఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్: మాణిక్యనగర్ కాలనీతోపాటు పలు కాలనీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం టౌన్ టు కార్యదర్శి సమ్మెట రాజమౌళి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డీఈ సీహెచ్ ఉపేందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. మాణిక్యనగర్ కాలనీకి ప్రధానంగా రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. 20వ వార్డు పరిధిలోని మాణిక్య నగర్ కాలనీ ఏర్పాటై సంవత్సరాలు గడుస్తున్నా కనీస సౌకర్యాలు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హేమా, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, భాస్కర్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి



రైల్వే డీఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం కె గోపాలకృష్ణన్‌ను డోర్నకల్‌లో గార్ల రైల్వే ప్రయాణికుల కమిటీ కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం పొడవు తక్కువగా ఉందని, ప్లాట్‌ఫారంపై నీడషెడ్లు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. శాతవాహన, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హోల్టింగ్ ఇవ్వాలని, రద్దు అయిన నాగ్‌పూర్ ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని డీఆర్ఎంకు విన్నవించారు. కార్యక్రమంలో కందునూరి ఈశ్వర్‌లింగం, రాధాకృష్ణ, రాజశేఖర్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.